అన్నదానం



జి.కొండూరు: జి.కొండూరు, వెలగలేరు గ్రామాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వైద్య పరీక్షల నిమిత్తం వచ్చే రోగులు, గర్భిణులు, బాలింతలకు శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సేవా సంస్థల నిర్వాహకుడు టీజేఆర్ గుప్తా మాట్లాడుతూ ప్రతి నెలా 9వ తేదీన ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీకల్యాణి పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి తోడ్పడాలి

ఎంపీపీ మెర్సీవనజాక్షి

విస్సన్నపేట: అధికారులు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో మండల అభివృద్ధికి తోడ్పడాలని ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అన్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో బుధవారం సాయంత్రం మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా సచివాలయాలకు మంజూరైన రూ.3 కోట్లతో మండలంలో పలు గ్రామాల్లో సీసీ రోడ్లు ఏర్పాటు పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. నాలుగు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయిందని తెలిపారు. వర్షాకాలంలో రైతులకు విష సర్పాల ప్రమాదం పొంచి ఉందని అవసరమైన ఇంజెక్షన్లు ప్రభుత్వ ఆస్పత్రులలో అందుబాటులో ఉంచాలని మాజీ వైస్ఎంపీపీ ఓలేటి దుర్గారావు వైద్యాధికారిని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు లోకేశ్వరరెడ్డి, ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ, తహసీల్దార్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మెర్సీవనజాక్షి

ఆర్థిక లావాదేవీలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలి



మునునూరు: గ్రామైక్య సంఘాల, మండల మహిళా సమాఖ్యల ఆర్థిక వ్యవహారాలు అన్నింటినీ ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు దువ్వూరి పద్మావతి సూచించారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం కుంటం బాబు అధ్యక్షతన సీసీలు, వీఓఏలకు ఆర్థిక లావాదేవీల నిర్వహణ, ఆర్థిక వ్యవహారాల నిబంధనలు, పరిమితులపై బుధవారం శిక్షణ ఇచ్చారు. గ్రామ సంఘాల, మండల సమాఖ్యల ఆర్థిక సేవల విధానం, పొదుపు, రుణ విధానం, నిధులు, రుణాల రకాలు, వడ్డీ రేటు, వాయిదాల చెల్లింపులు తదితర అంశాలపై ఏపీఎంలు బాబు, రాజశేఖర్ అవగాహన కల్పించారు.

వైభవంగా శాంతి కల్యాణం



అగిరిపల్లి(నూజివీడు): అగిరిపల్లిలోని శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహ స్వామికి బుధవారం శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలుగా జి.రాజేష్కుమార్ దంపతులు పాల్గొని కల్యాణం చేయించారు. ప్రధాన అర్చకులు వేదాంతం శేషుబాబు, జి.అనంత కృష్ణ వేదమంత్రోచ్చారణ నడుమ కల్యాణం కమనీయంగా సాగింది. ఆలయ కార్యనిర్వహణాధికారి భవాని పాల్గొన్నారు.

ఫెన్సింగ్ పోటీలకు గొల్లపల్లి విద్యార్థులు

నూజివీడు: నూజివీడు మండలం గొల్లపల్లి హైస్కూల్ విద్యార్థులు ఇద్దరు రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం పొట్లూరి రాధికారాణి బుధవారం తెలిపారు. విజయవాడ గుణదలలోని ఇన్నర్ రింగురోడ్డులో ఉన్న అంబిటాస్ ఇంటర్నేషనల్ స్కూల్లో నిర్వహించిన జూనియర్ బాలబాలికల ఫెన్సింగ్ జిల్లా జట్ల ఎంపికలో హైస్కూల్కు చెందిన ఐ.ఉగ్ర, పి.నిఖిల్కుమార్ ఎంపికయ్యారని పేర్కొన్నారు. వీరు ఈనెల 12, 13 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించే 9వ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. వీరిని హెచ్ఎంతో పాటు విద్యాకమిటీ చైర్మన్ వల్లగాని వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.



ఫెన్సింగ్ జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నేల తల్లిని కాపాడుకోవాలి



ఇంజినీరింగ్ కళాశాలలో మొక్కలు నాటుతున్న కిశోర్కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు

మైలవరం: నేల తల్లిని కాపాడుకోవాలని, పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని 12 సంవత్సరాలు దేశ రక్షణ విభాగంలో పనిచేసి, పదవీ విరమణ చేసిన దావులూరి కిశోర్కుమార్ తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 సంవత్సరాలు అయిన సందర్భంగా ఏడాది పాటు నిర్వహించిన ఆజాదీ కా అమృత్ మహోత్సవాలు బుధవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో కిశోర్కుమార్ పాల్గొని కళాశాలలోని విద్యార్థుల హాస్టల్లో మొక్కలు నాటారు. ఎల్బీఆర్సీఈ ఎన్ఎస్ఎస్ యూనిట్, రెడ్క్రాస్ సొసైటీ మైలవరం సబ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ బి. శివ హరిప్రసాద్, గూడూరు నాగిరెడ్డి, శీలం ఉమామహేశ్వరరెడ్డి, కోఆర్డినేటర్ ఆర్ పవిత్ర, వి.భాగ్యలక్ష్మి, షాహెదా నీలోఫర్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కార్యక్రమం జరిగింది. మండలంలోని పొందుగల గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణిస్వామి, సర్పంచ్ కోటమ్మ, మాజీ సర్పంచ్ చలపతిరావు పాల్గొన్నారు.

మెరిట్ స్కాలర్షిప్నకు విద్యార్థుల ఎంపిక



మెరిట్కార్డులను అందజేసిన హెచ్ఎం రవికుమార్

ఏ.కొండూరు: మండలంలోని పోలిశెట్టిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులు టి.భానుశేఖర్, ఎం.వరుణ్సందేష్ 2022–23 సంవత్సరంలో నిర్వహించిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్నకు ఎంపికైనట్లు హెచ్ఎం ఎ.రవికుమార్ బుధవారం తెలిపారు. ఈ స్కాలర్షిప్నకు ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకు ప్రభుత్వం ప్రతి సంవత్సరం రూ.12వేలు చొప్పున అందజేస్తుందని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల హెచ్ఎం, తోటి ఉపాధ్యాయులు అభినందించి, ఎన్ఎంఎంఎస్ పరీక్ష మెరిట్కార్డులను అందజేశారు.

జనవిజ్ఞాన వేదికతో శాస్త్రీయ సమాజం



సభ్యత్వ నమోదు వాల్పోస్టర్లను ఆవిష్కరించిన జేవీవీ నాయకులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): జనవిజ్ఞాన వేదిక శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం కృషి చేస్తోందని ప్రముఖ వైద్యుడు మామిడి సీతారామారావు అన్నారు. కొండపల్లిలో బుధవారం జరిగిన ఆ సంస్థ సంస్థాగత సమావేశంలో ఆయన మాట్లాడారు. శాస్త్రీయ విజ్ఞాన ఫలాలు సామాన్యుల వద్దకు చేర్చి సమాజంలో మూఢనమ్మకాలు నివారిస్తున్నట్లు తెలిపారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు వి.మురళీమోహన్ మాట్లాడుతూ 1988లో జేవీవీ ఏర్పడినప్పటి నుంచి సత్యాన్వేషణ, స్వావలంబన, దేశ సమగ్రత, ప్రపంచ శాంతికి కృషి చేస్తోందన్నారు. జేవీవీ సభ్యత్వ నమోదు వాల్పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ మహాబాషా, జిల్లా ఉపాధ్యక్షుడు పి.కామేశ్వరరావు, మాజీ సర్పంచ్ అమ్మాజీ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలన



తిరువూరులో ఓటర్ల జాబితా పరిశీలన

తిరువూరు: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తిరువూరు పట్టణంలో ఓటర్ల జాబితా పరిశీలన కార్యక్రమం కొనసాగుతోంది. పలు వార్డులలో బీఎల్ఓలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇంటింటికీ తిరిగి ఓటర్ల వివరాలను పరిశీలిస్తున్నారు. ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన ఓటర్లు, మృతిచెందినవారు, చిరునామా మార్పు కోరినవారి వివరాలను ఎన్నికల సంఘం యాప్లో నమోదు చేస్తున్నారు. 8, 9, 14, 15 వార్డుల్లో బుధవారం ఓటర్ల జాబితా పరిశీలన జరిగింది.



ఓటర్ల జాబితాపై సమీక్షిస్తున్న సబ్కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

నూజివీడులో..

నూజివీడు: ఓటర్ల జాబితా పరిశీలన కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని సబ్కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ బీఎల్ఓలను ఆదేశించారు. స్థానిక సబ్కలెక్టర్ కార్యాలయంలో బుధవారం బీఎల్ఓలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈనెల 21తో గడువు పూర్తవుతున్నందున చురుగ్గా కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. 2024, జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండుతున్న వారి వివరాలను నమోదు చేసుకుని వారికి తప్పని సరిగా ఓటు నమోదు చేయాలన్నారు. ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీలు, నకిలీ ఓట్ల గుర్తింపు, చనిపోయిన వారి ఓట్లు తొలగింపు, వందేళ్ల వయస్సు పైబడిన వారి గుర్తింపు, ఒకే డోరు నంబరుపై పదుల సంఖ్యలో ఉన్న ఓట్ల పరిశీలన, సర్వీసు ఓటర్లు, ఎన్ఆర్ఐ ఓటర్ల వివరాలను సరిచేయడం వంటివి చేయాలని వివరించారు. ఒక బూత్లో సరాసరి 1,500 ఓట్లకు మించి ఉంటే నూతన బూత్కు సిఫార్సు చేయాలని, ఓటరు జాబితాలో పేర్లు లేకపోయినా, తప్పులున్నా, బూత్లు మారినా సరిచేయాలన్నారు.

అధికారులు సకాలంలో హాజరుకావాలి



సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

తిరువూరు: ప్రజా సమస్యలపై చర్చించే మండల పరిషత్ సమావేశాల్లో అధికారులు గైర్హాజరు కారాదని ఎంపీపీ గద్దల భారతి పేర్కొన్నారు. తిరువూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పలువురు అధికారులు సరైన సమాచారం లేకుండా సమావేశానికి రావడం, కొందరు గైర్హాజరవుతుండడంతో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు అడిగే సమస్యలకు సమాధానం ఇవ్వడం లేదన్నారు. ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, ఇన్చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు, తహసీల్దారు సురేష్బాబు, ఎంఈఓ శ్యాంసుందర్ పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో వంద మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఎంఎస్ఎన్ ల్యాబ్ ప్రతినిధులు, అధ్యాపకులు

విస్సన్నపేట: హైదరాబాద్కు చెందిన ప్రముఖ ఔషధ సంస్థ ఎంఎస్ఎన్ ల్యాబ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో స్థానిక వికాస్ పీజీ, పార్శశ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 100 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ నరెడ్ల నర్సిరెడ్డి తెలిపారు. ప్రాంగణ ఎంపికలకు 300 మంది హాజరయ్యారు. వీరిలో 100 మంది ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను నర్సిరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ఎంఎస్ఎన్ ల్యాబ్ ప్రతినిధులు పి.అర్జున్ బి.ప్రశాంత్, ఎం.రామ్మోహనరావు, ఎల్వీ ప్రసాద్, వికాస్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చల్లా సుధీర్రెడ్డి, పార్శశ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ శ్రీనివాసరావు, డాక్టర్ తిరుమలేశ్వరరావు, డాక్టర్ పి.వెంకట్, డాక్టర్ ఎస్.మాధవి పాల్గొన్నారు.

సాహిత్య ప్రక్రియపై వర్క్షాప్

తిరువూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో బుధవారం సాహిత్య ప్రక్రియపై వర్క్షాప్ నిర్వహించారు. కళాశాల తెలుగు విభాగాధిపతి విజయానందరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తెలుగు సాహిత్యం, తెలుగు భాషా ప్రక్రియ, కథ, కథానిక, నాటకం వంటి ప్రక్రియలపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. విజయవాడ లయోలా, సిద్ధార్థ, నందిగామ కేవీఆర్ కళాశాలల తెలుగు బాషాధిపతులు శేఖర్, శివకుమార్, కిషోర్, తిరువూరు ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ సుశీలరావు పాల్గొన్నారు.

పీఆర్టీయూ నూతన పాలకవర్గం



నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం

విజయవాడరూరల్: ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్టీయూ) విజయవాడ రూరల్ మండల నూతన కమిటీ ఎన్నిక జక్కంపూడి హైస్కూల్లో బుధవారం జరిగింది. అధ్యక్షుడు పుండరీకాక్షుడు, ప్రధానకార్యదర్శి వీర్ల సుభాష్ చంద్రబోస్, జిల్లా కౌన్సిలర్స్గా వి.మాధవి, జెరహా, గౌరవాధ్యక్షురాలుగా కోట వెంకటేశ్వరావు, మహిళా కార్యదర్శులు టి. కృష్ణవేణి, ఎం.వెంకటలక్ష్మి, కె.పద్మశ్రీ ఎన్నికయ్యారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కె.హరికిరణ్ నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మౌలాసాహెబ్, కె.ఆంజనేయులు పాల్గొన్నారు.

లేగదూడల అందాల పోటీల ప్రదర్శన



లేగదూడల అందాల ప్రదర్శన

ఏ.కొండూరు: పశుకృత్రిమ గర్భధారణను పాడి రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి డాక్టర్ ఎం.శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని పోలిశెట్టిపాడులో బుధవారం లేగదూడలు అందాల ప్రదర్శన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులువారి పశువులు గర్భం దాల్చిన తర్వాత వాటిని జాగ్రత్తగా చూసుకుని, ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. దూడల పోషణలో పాటించాల్సిన మెలకువలను వివరించారు. గ్రామంలో 15 పశువులకు కృత్రిమ గర్భనిర్ధారణ చేయగా వాటిలో 14 పశువులు గర్భం దాల్చాయని, వీటికి వైద్యం అందించిన జూనియర్ వెటర్నరీ బి.కృష్ణారావును సత్కరించి అభినందించారు. లేగదూడల అందాల ప్రదర్శనలో 37మంది రైతులకు చెందిన 51 లేగదూడలు ఈ పోటీల్లో పాల్గొనగా, ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన లేగదూడల యజమానులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి కె. శ్రీనివాసరావు, సర్పంచ్ బి.చిట్టిబాబు, పీఏసీఎస్ చైర్మన్ తుమ్మూరు వెంకటేశ్వరరెడ్డి, పశువైద్యాధికారి భరత్ పాల్గొన్నారు.

























క్లుప్తంగా

గ్రావెల్ రోడ్ల నిర్మాణం



నూజివీడు: స్థానిక ఎమ్మార్ అప్పారావు కాలనీలోని మట్టి రోడ్లను గ్రావెల్ రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు మున్సిపాలిటీ చర్యలు చేపట్టింది. ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు ఆదేశాల మేరకు మట్టి రోడ్లను అభివృద్ధి చేసే పనులను బుధవారం ప్రారంభించారు. అంతర్గత మట్టి రోడ్లన్నింటికీ గ్రావెల్‌ను తోలుతున్నారు. వర్షం కురిసినప్పుడు మట్టి రోడ్లన్నీ బురదమయంగా మారుతున్న నేపథ్యంలో గ్రావెల్ రోడ్లు నిర్మించడంవల్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, కో–ఆప్షన్ సభ్యుడు రామిశెట్టి మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకుడు షేక్ మస్తాన్ వలీ రోడ్ల అభివృద్ధి పనులను పరిశీలించారు. మున్సిపల్ డీఈ దాస్యం లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు.

నాయకత్వ శిక్షణ శిబిరం పరిశీలన



ఆగిరిపల్లి(నూజివీడు): మండలంలోని తోటపల్లి హీల్ ప్యారడైజ్ స్కూల్లో ప్రధానోపాధ్యాయులకు నిర్వహిస్తున్న పాఠశాల నాయకత్వ శిక్షణ శిబిరాన్ని బుధవారం కాకతీయ యూనివర్సిటీకి చెందిన బిజినెస్ కామర్స్ హెడ్ ఆచార్య వీరయ్య సందర్శించారు. వృత్తి పట్ల సరైన అవగాహన, గౌరవం, ప్రైవేటు, ప్రభుత్వ భాగస్వామ్యం తదితర అంశాలను వివరించారు. న్యూ ఎడ్యుకేషన్ పాలసీ 2020 ప్రకారం వృత్తి విద్యను పాఠశాల స్థాయిలో ఏ విధంగా ప్రవేశపెట్టాలో చెప్పారు. విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ప్రస్తుత ఉద్యోగాలపట్ల, వృత్తి విద్య పట్ల ఆలోచన, వైఖరిలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలోని అన్ని శిక్షణ కేంద్రాలకు ఈ కార్యక్రమాన్ని లైవ్ కాస్ట్ చేశారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ సమగ్ర శిక్ష డైరెక్టర్ బి.విజయభాస్కర్, కోర్స్ అబ్జర్వర్ అరుణ, ఏలూరు జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ భాస్కర్ కుమార్, ఎంఈఓ సురేష్ పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి



మధురానగర్(విజయవాడసెంట్రల్): గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవటంతో పాటు వైఎస్సార్ పట్టణ ఆరోగ్యకేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని గులామొహుద్దీన్‌నగర్ ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఆయేషా సూచించారు. అల్లూరి సీతారామరాజు వంతెన సమీపంలోని గులామొహుద్దీన్‌నగర్ ఆరోగ్యకేంద్రంలో బుధవారం ప్రధాన మంత్రి సురక్ష మాతృ యోజన కార్యక్రమంలో భాగంగా హైరిస్కు గర్భిణులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వేసుకోవాల్సిన టీకాల గురించి వివరించారు. అలాగే ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో ప్రసవం చేయించుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులు, చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలు వేశారు.

బీఎల్‌ఓలకు సహకరించండి

పటమట(విజయవాడతూర్పు): ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో గత నెల 21 నుంచి ఈ నెల 21 వరకు ఇంటింటికీ ఓటరు సర్వే జరుగుతుందని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు విజయవాడ నగర నగరవాసులు ఇంటింటి వచ్చిన బూత్ లెవెల్ ఆఫీసర్ (బీఎల్‌వో) లకు తమ కుటుంబ సభ్యుల వివరాలు అందించి సహకరించాలని కోరారు. కుటుంబంలో 18 ఏళ్లుదాటిన వారిని ఓటరుగా నమోదు చేయించాలని సూచించారు.

త్రిశక్తి పీఠంలో హుండీ కానుకల లెక్కింపు

కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్టాండ్ సమీపంలోని కాళీమాత అమ్మవారి దేవస్థానం (త్రిశక్తి పీఠం)లో అమ్మవారికి భక్తులు సమర్పించిన హుండీ కానుకలు బుధవారం లెక్కించారు. ఏప్రిల్ 13 నుంచి ఆగస్టు 9వ తేదీ వరకు 119 రోజుల్లో భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించగా రూ.7,43,265 ఆదాయం లభించింది. ఈవో పి.లోకేశ్వరీ పర్యవేక్షణలో ఆలయ సూపరింటెండెంట్ మధుసూదనరావు ఆధ్వర్యంలో భక్తుల సమక్షంలో కమిటీ సభ్యులు 12 హుండీలను తెరిచి కానుకలు లెక్కించారు. ఆలయ పాలకవర్గ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు గొల్లపూడి పుల్లయ్య, కార్యదర్శి కె.జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారుడు బి.హెచ్.విజయకిరణ్, కమిటీ సభ్యులు జి.సత్యనారాయణ, జగన్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధులను స్మరించుకోవాలి



మేడూరులో స్వాతంత్య్ర సమరయోధుల శిలాఫలకం ఆవిష్కరణలో జెడ్పీటీసీ సభ్యుడు, అధికారులు

మేడూరు(గంపలగూడెం): స్వాతంత్య్ర సమరయోధులను ఎప్పటికీ స్మరించుకోవాల్సి ఉందని గంపలగూడెం జెడ్పీటీసీ సభ్యుడు కోట శామ్యూల్ తెలిపారు. 'నా భూమి–నాదేశం' కార్యక్రమంలో భాగంగా గంపలగూడెం మండలం మేడూరు, సత్యాలపాడు, వినగడప, గుళ్లపూడి, సొబ్బాల గ్రామాల్లో ఏర్పాటు చేసిన స్వాతంత్య్ర సమరయోధుల శిలాఫలకాలను బుధవారం ఆవిష్కరించారు. మేడూరులో జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ దేశ స్వాతంత్య్రం కోసం ఎందరో మహనీయులు తమ జీవితాలను త్యాగం చేశారన్నారు. వారి త్యాగాలను భావి తరాలకు గుర్తుచేసేలా ప్రభుత్వం శిలాఫలకలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సర్పంచ్‌లు గుండ్ల లక్ష్మి, చిమల ఉమాదేవి, ఎంపీటీసీ సభ్యురాలు విజయనిర్మల, ఎస్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ వెంకటేశ్వర్లు, ఎంఈఓలు పీవీడీఎల్ నరసింహారావు, వైఎస్సార్ సీపీ నాయకులు బాలు, కృష్ణ పాల్గొన్నారు.

తిరువూరు మండలంలో..

తిరువూరురూరల్: ఆజాదీకి అమృత్ మహోత్సవ్ ముగింపు సందర్భంగా తిరువూరు మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం కార్యక్రమాలు నిర్వహించారు. నాభూమి–నాదేశం, నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం తదితర కార్యక్రమాలను కోకిలంపాడు, మల్లేల, లక్ష్మీపురం గ్రామాల్లో జరిపారు. సర్పంచులు మాధవీలక్ష్మి, వంగూరి మరియమ్మ, శ్రీనివాసరావు, మల్లేల పీఏసీఎస్ చైర్మన్ కలకొండ రవికుమార్, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ప్రారంభం

ముసునూరు: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు–2023లో భాగంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకలను విజయవంతం చేయాలని వైస్ ఎంపీపీ కె.రాజానాయన, జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్ పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జి.రాణి అధ్యక్షతన ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాలను బుధవారం ప్రారంభించారు. ఈ నెల 16 వరకు నిర్వహించే కార్యక్రమాల వివరాలను ఎంపీడీఓ సచివాలయ సిబ్బందికి వివరించారు. చింతలవల్లి సర్పంచ్ సత్యనారాయణ, తహసీల్దార్ దాసరి సుధ, ఈఓపీఆర్డీ సత్యనారాయణ, ఏపీఎం కుంటంబాబు, ఏపీఓ రోజలీల పాల్గొన్నారు.

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: ఆజాదీకా అమృత మహోత్సవ కార్యక్రమంలో భాగంగా నాభూమి–నా దేశం, మాతృమూర్తికి వందనం కార్యక్రమాన్ని బుధవారం మండలంలోని రంగాపురం, నరుకుళ్లపాడు, రుద్రవరం, కుదప గ్రామ పంచాయతీ పరిధిలో ఉత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నేల తల్లికి వందనం, అమృత సరోవర్ చెరువుల వద్ద, స్కూల్స్ వద్ద, గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ఆయా గ్రామపంచాయతీల సర్పంచ్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పడిశాల సునీల, నూనె అప్పిరెడ్డి, బలగాని రాధమ్మ, నాయకులు బుజ్జి, తిరుపతిరావు, కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తెల్లదేవరపల్లిలో..

తెల్లదేవరపల్లి (విస్సన్నపేట): మండలంలోని తెల్లదేవరపల్లి, చంద్రుపట్ల, లంబాడీ తండా గ్రామాల్లో సచివాలయ పరిధిలో నా భూమి–నా దేశం, నేల తల్లికి నమస్కారం వీరులకు వందనం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన శిలాఫలకాల వద్ద స్వాతంత్య్ర సమరయోదులను, యుద్ధ వీరుల స్మరించుకుంటూ నివాళులర్పించారు. నేల తల్లికి పూలు జల్లి పూజలు చేశారు. మొక్కలు నాటారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్ వెంకటరమణ, ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి, తెల్లదేవరపల్లి సర్పంచ్ నాగరాణి, చంద్రుపట్ల సర్పంచ్ బాలకొండయ్య, లంబాడీ తండా సర్పంచ్ దారావతు బోడి ,ఏపీఓ అనురాధ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



తెల్లదేవరపల్లిలో నా భూమి–నా దేశం కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ వనజాక్షి, అధికారులు



తిరువూరు మండలం మల్లేలలో ఆజాదీకి అమృత్ మహోత్సవ్



ముసునూరులో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుక



రెడ్డిగూడెం మండలంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

సర్వేలో లోపాలు ఉంటే చర్యలు

ఆర్డీఓ విజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ విజయ్‌కుమార్

పెనమలూరు: నియోజకవర్గంలో ఓటర్ల సర్వే సక్రమంగా నిర్వహించి ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని ఆర్డీఓ విజయ్‌కుమార్ అన్నారు. పెనమలూరు నియోజకవర్గంల్లో ఓటర్ల జాబితా సర్వేపై బుధవారం పెనమలూరు మండల పరిషత్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ విజయ్‌కుమార్ మాట్లాడుతూ బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో చేస్తున్న సర్వేను సూపర్‌వైజర్లు పరిశీలించాలని ఆదేశించారు. ప్రధానంగా మృతి చెందిన ఓటర్లను గుర్తించటం, డబుల్ ఎంట్రీలు, డోర్ నంబర్లు తనిఖీ చేయాలన్నారు. 18 సంవత్సరాలు వయస్సు నిండిన వారికి ఓటు హక్కు కల్పించాలన్నారు. ఓటర్ల జాబితా సర్వేలో లోపాలు ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఒక నామినేషన్ దాఖలు

ఆగిరిపల్లి(నూజివీడు): మండలంలోని ఎస్‌ఏపేట పంచాయతీ 4వ వార్డు సభ్యుని పదవికి బుధవారం ఒక నామినేషన్ దాఖలైనట్టు ఎంపీడీఓ పి.శంకర్‌రావు తెలిపారు. అడవినెక్కలం సర్పంచ్ పదవికి, కృష్ణవరం ఏడో వార్డుకు, ఈదులగూడెం ఏడో వార్డుకు నామినేషన్లు రాలేదని చెప్పారు. నామినేషన్లు వేసేందుకు ఈ నెల 10వతేదీ సాయంత్రం ఐదు గంటల వరకు మాత్రమే గడువు ఉందని తెలిపారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భార్యను వేధిస్తున్న భర్తపై గవర్నర్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు... రెడ్డిగూడెం మండలం కుదప గ్రామానికి చెందిన కొత్తపల్లి సునీత 2022లో వంశీ అనే వ్యక్తిని ప్రేమ వివాహం చేసుకుంది. తల్లిదండ్రులు వారి వివాహాన్ని అంగీకరించడంతో ఇద్దరూ కలిసి కుదపలో కాపురం పెట్టారు. ఆ తర్వాత కొంతకాలానికి భర్త ప్రవర్తనలో మార్పు వచ్చింది. నిత్యం గొడవ పడుతూ ఆమెను శారీరకంగా, మానసికంగా వేధించసాగాడు. ఆమెను వదిలి వంశీ తన సొంత ఊరు యనమలకుదురు వెళ్లిపోయాడు. అప్పటి నుంచి సునీత విజయవాడలో తన పిన్ని వద్ద ఉంటూ బీసెంట్ రోడ్డులోని ఓ షాపులో పనిచేస్తోంది. ఆమె అడ్రస్ తెలుసుకున్న భర్త వంశీ మంగళవారం ఆమె పనిచేస్తున్న షాపు వద్దకు వెళ్లి గొడవ చేశాడు. దీనిపై సునీత గవర్నర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పనికని ఇంటి నుంచి వెళ్లిన తన భార్య కనబడడం లేదంటూ ఓ భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రామకృష్ణాపురం కోడూరు వారి వీధికి చెందిన చిన్న సాయి కిరణ్, హరిత దంపతులు నాలుగేళ్ల క్రితం ప్రేమించి వివాహం చేసుకున్నారు. నగరంలోని ఓ వస్త్ర దుకాణంలో ఇద్దరు పనిచేస్తుంటారు. బంగారం కొనుగోలు విషయంలో భార్యాభర్తలకు మధ్య రెండు రోజుల క్రితం గొడవ జరిగింది. ఈ నెల 8వ తేదీన సాయికిరణ్‌కు సెలవు కావడంతో హరిత షాపునకు వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లింది. మధ్యాహ్నం ఆమెకు ఫోను చేయగా ఎంతసేపటికి ఎత్తలేదు. దీంతో అనుమానం వచ్చి షాపు దగ్గరకు వెళ్లి విచారించగా హరిత పనికి రాలేదని తెలిపారు. ఆమె ఆచూకీ కోసం చుట్టుపక్కల ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల ఇళ్ల వద్ద ఆరాతీసిన ఎక్కడా కనిపించకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కట్నం వేధింపులపై కేసు నమోదు

పెనమలూరు: కట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు కామయ్యతోపునకు చెందిన కొండపల్లి థెరిస్సాకుమారి గత 2021 సంవత్సరంలో వెలిశల శశికుమార్‌ను కట్నకానుకలు ఇచ్చి వివాహం చేసుకుంది. థెరిస్సాకుమారి పోరంకిలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పని చేస్తుండగా భర్త శశికుమార్ ప్రైవేటు స్కూల్ టీచర్‌గా పని చేస్తున్నాడు. వీరికి పిల్లలు లేరు. కాగా భర్తతో పాటు అత్త రాజకుమారి అదనపుకట్నం కావాలని వేధిస్తూ థెరిస్సాకుమారిని పుట్టింటికి పంపారు. పెద్దలు నచ్చచెప్పినా అత్తింటివారిలో మార్పురాలేదు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు అత్తింటివారిపై వరకట్నం వేధింపుల కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

పర్యాటక రంగంపై ఆసక్తి చూపాలి



కానూరులో ఏర్పాటు చేసిన యువటూరిజం క్లబ్‌లో విద్యార్థులు

పెనమలూరు: విద్యార్థులు పర్యాటక రంగంపై ఆసక్తి చూపి నూతన విషయాలు తెలుసుకోవాలని ఇండియన్ టూరిజం నోడల్ ఆఫీసర్ రవి రత్నసేనాపతి అన్నారు. కానూరు కేసీపీ సిద్దార్థ ఆదర్శ రెసిడెన్షియల్ పాఠశాలలో బుధవారం యువ టూరిజం క్లబ్ ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టూరిజం వలన సంపన్నమైన సాంస్కృతిక వారసత్వాన్ని పెంపొందించుకోవచ్చని అన్నారు. పాఠశాల కన్వీనర్ వీరపనేని శశికళ మాట్లాడుతూ క్లబ్ ఏర్పాటు చేయటం వలన విద్యార్థులు దేశంలో ముఖ్యమైన ప్రాంతాలు సందర్శించటానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ జాఫర్, ప్రిన్సిపాల్ మనోజ్ కర్మాకర్, వైస్ ప్రిన్సిపాల్ సాయికృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



లబ్బీపేట(విజయవాడతూర్పు): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న మేరా మట్టి మేరా దేశ్ కార్యక్రమంలో నలంద విద్యార్థులు బుధవారం మొక్కలు నాటారు. ఆ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో క్విట్ ఇండియా డే సందర్భంగా పెనమలూరులోని బ్లూమింగ్ డే స్కూలు ఆవరణలో వందకు పైగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల పర్యావరణ కాలుష్యాన్ని నివారించవచ్చని తెలిపారు. తమ విద్యార్థులు ఇలాంటి ప్రజాహిత కార్యక్రమాల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.వెంకటేశ్వరరావుతో పాటు 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఒత్తిడిలేని విద్య అందించాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థులకు ఒత్తిడిలేని విద్యను అందించాల్సిన అవసరం ఉందని లేడీస్ సర్కిల్ ఇన్ ఇండియా డైరెక్టర్ శృతి అన్నారు. రౌండ్ టేబుల్ ఇండియా, లేడీస్ సర్కిల్ ఇన్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం ఎంజీరోడ్డులోని భవిష్య జూనియర్ కళాశాలలో మోటివేషన్ క్లాసులు నిర్వహించారు. ఈ సందర్భంగా శృతి మాట్లాడుతూ పేద, బడుగు, బలహీనవర్గాల పిల్లలందరూ చదువుకునేందుకు తమ వంతు తోడ్పాటు అందిస్తామన్నారు. స్నేహభావంతో విద్యలో అందరూ రాణించాలనేది తమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. పేదరికం వలన ఎవరూ విద్యకు దూరం కాకూడదని, ఎంతో మంది విద్యార్థులకు అవసరమైన సహాయాన్ని అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆ కళాశాల ప్రిన్సిపాల్ యం.శ్రీనివాస్, డాక్టర్ హర్ష, డాక్టర్ అమూల్య, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతికి ప్రతీక చేనేత వస్త్రాలు



చేనేత వస్త్రాలు తిలకిస్తున్న సీవీసీ డైరెక్టర్ జానకి

పటమట(విజయవాడతూర్పు): విశిష్టమైన భారతీయ సంస్కృతికి చేనేత వస్త్రాలు ప్రతీకలుగా నిలుస్తాయని సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) డైరెక్టర్ ఎం.జానకి అన్నారు. పటమట పంటకాల్వ రోడ్డులోని స్టెల్లా కళాశాల ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న చేనేత జౌళి శాఖ, ఆప్కో చేనేత వస్త్ర ప్రదర్శనను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా జానకి మాట్లాడుతూ అపురూపమైన నైపుణ్యత, సృజనాత్మకతతో చేనేత కార్మికులు అహర్నిశలు కష్టపడి ఇంద్రధనస్సు వంటి చేనేత వస్త్రాలను తయారు చేస్తున్నారని చెప్పారు. వాటిని ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరారు. చేనేత జౌళి శాఖ, ఆప్కో ఈ తరహా ప్రదర్శనలు ఏర్పాటు చేయటం నేత కార్మికులకు ఎంతో ఉపయోగకరమన్నారు. తరతరాల భారతీయ సంస్కృతి, వారసత్వానికి ప్రత్యక్ష నిదర్శనాలుగా చేనేత సోయగాలు నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వారంలో ఒకరోజైనా నేత దుస్తులను ధరించాలని కోరారు. కార్యక్రమంలో ఆప్కో జీఎం తనూజారాణి తదితరులు పాల్గొన్నారు.

భక్తుల సూచనలు స్వీకరించాలి



తలనీలాలు సమర్పిస్తున్న భక్తులతో మాట్లాడుతున్న చైర్మన్ రాంబాబు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమ్మవారికి తలనీలాలు సమర్పించేందుకు విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చూడాలని, వారికి ఏమైనా సమస్యలు ఎదురైనా వాటిని ఫిర్యాదులు, సూచనల రూపంలో స్వీకరించాలని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు అధికారులను ఆదేశించారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన కేశ ఖండనశాలను బుధవారం చైర్మన్ కర్నాటి రాంబాబు పరిశీలించారు. తలనీలాలు సమర్పించేందుకు విచ్చేసే భక్తుల పట్ల గౌరవంగా మాట్లాడాలని, సిబ్బంది ప్రవర్తన అమ్మవారి ఆలయానికి మంచి పేరు తీసుకువచ్చేలా ఉండాలని చైర్మన్ రాంబాబు పేర్కొన్నారు. భక్తుల తమ అభిప్రాయాలతో పాటు ఫిర్యాదులు, సూచనలు చేసేందుకు పుస్తకాన్ని అందుబాటులో ఉంచాలని, ఆ పుస్తకంలో నమోదయిన ప్రతి అంశాన్ని ఆలయ ఈవో, తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కేశ ఖండనశాలలో పారిశుద్ధ్యాన్ని పరిశీలించిన చైర్మన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. దుర్గాఘాట్ నుంచి అమ్మవారి సన్నిధికి, అమ్మవారి సన్నిధి నుంచి ఘాట్‌కు దేవస్థానం ఏర్పాటు చేసిన ఉచిత బస్సు సర్వీసులను వినియోగించుకోవాలని భక్తులతో పేర్కొన్నారు.

అణగారిన వర్గాల మహిళలపై ఆగని హింస

దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ ఝాన్సీ గెడ్డం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దేశంలో అణగారినవర్గాల మహిళలపై నిత్యం దాడులు, హింస జరుగుతూనే ఉన్నాయని దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ ఝాన్సీ గెడ్డం అన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో 'స్వతంత్ర్య భారతంలో కులం, మతం, హింస అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అణగారిన వర్గాల మహిళలపై జరుగుతున్న హింసకు మణిపూర్ ఘటనే తార్కాణమని చెప్పారు. ఈ ఘటనలో సిగ్గుపడాల్సింది బాధిత మహిళలు కాదని, యావత్ భారత దేశం సిగ్గుతో తలదించుకోవాలన్నారు. మహిళలపై హింసను అరికట్టాలని కోరారు. నాగార్జున విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగాధిపతి ప్రొఫెసర్ అనిత మాట్లాడుతూ మణిపూర్ అంటేనే భయమేస్తోందని తెలిపారు. ఈ హింసకు ముగింపు లేదా? అని ప్రశ్నించారు. దేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో దూసుకు పోతున్నా మహిళలపై జరిగే అఘాయిత్యాలు, దారుణాలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. స్త్రీలకు రాజ్యాంగం హక్కులు కల్పించినా, ప్రత్యేక చట్టాలు ఉన్నా అవి అమలు కావడంలేదని ఆవేదన చెందారు. జీవించే హక్కు, స్వేచ్ఛ కలిగిన దేశంలో ఇటువంటి ఘటనలు జరగడం బాధాకరమన్నారు. సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షురాలు బి.శ్వేత, భూమిక సంస్థ ప్రతినిధి అనుపమ, సఫాయి కర్మచారి నాయకులు బి. శ్రీదేవి, దళిత స్త్రీ శక్తి కో ఆర్డినేటర్లు రోజా, మేరీనిర్మల, కుమారి, లక్ష్మీ ప్రసన్న, శ్రీనివాస్, భాస్కర్ పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



అంజనేయ నాయక్‌ను సత్కరిస్తున్న కారుమంచి రాజు, చిట్టిబాబు, నరసింహారావు తదితరులు

విజయవాడ కల్చరల్: ప్రణవీ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో గాంధీనగర్ కొతా పూర్ణానందం కళావేదికమీద బుధవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. అమర గాయకులు ఘంటసాల, బాల సుబ్రహ్మణ్యం, భానుమతి, పిఠాపురం నాగేశ్వరరావు తదితరులు గానం చేసిన గీతాలను కారుమంచి రాజు ఆధ్వర్యంలో అంజనేయ నాయక్, కృష్ణకుమారి, రూపాశ్రీ, షబానా, వడ్డాది కామేశ్వరి, పి.శ్రీనివాసరావు ఆలపించారు. ప్రణవీ మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకుడు కారుమంచి రాజు మాట్లాడుతూ విలువలతో కూడిన కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు తెలిపారు. వేదిక ద్వారా నూతన గాయనీ గాయకులకు అవకాశం కల్పిస్తునట్లు తెలిపారు. వివిధ సంస్థల ప్రతినిధులు జిలానీఖాన్, చింతకాయల చిట్టిబాబు సీనియర్ గాయకుడు బాలజీకుమార్, గెల్లి సువర్ణ, సత్యవర్ధన్ పాల్గొన్నారు. గాయకుడు అంజనేయ నాయక్‌కు యువగాన చక్రవర్తి బిరుదుతో సత్కరించారు.

హోంగార్డుల సమస్యల పరిష్కారానికే 'దర్బార్'






దర్బార్ కార్యక్రమంలో మాట్లాడుతున్న అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు (ఇన్‌సెట్) దర్బార్ కార్యక్రమానికి హాజరైన హోంగార్డులు

డీసీపీ మోకా సత్తిబాబు

విజయవాడ స్పోర్ట్స్: విధి నిర్వహణలో హోంగార్డులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా 'దర్బార్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అడ్మిన్ డెప్యూటీ పోలీస్ కమిషనర్ (డీసీపీ) మోకా సత్తిబాబు అన్నారు. కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు విజయవాడ పోలీస్ కమాండ్ కంట్రోల్ రూంలో దర్బార్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. డీసీపీ సత్తిబాబు పాల్గొని మాట్లాడారు. హోంగార్డులు పోలీస్ శాఖలో భాగమేనన్నారు. శాంతిభద్రతల సమస్య తలెత్తినపుడు పరిష్కరించేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని సూచించారు. బందోబస్తు, ఎస్కార్ట్ విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మంచి ఆహారపు అలవాట్లు, వ్యాయామం చేస్తూ శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని సూచించారు. వృత్తిపరమైన సమస్యలు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. మంగళగిరిలోని ఏపీ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో గత నెలలో నిర్వహించిన సంక్షేమ కమిటీ సమావేశంలో చర్చించిన పలు అంశాలపై హోంగార్డులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం విధి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని పలువురు హోంగార్డులు విన్నవించారు. హోంగార్డ్స్ కమాండెంట్ కె.వి.ప్రేమ్‌జిత్, హోం గార్డ్స్ డీఎస్పీ ఐ.మోహన్‌కుమార్, ఆర్ఐ కృష్ణ పాల్గొన్నారు.

స్టెల్లా ఆధ్వర్యంలో శాంతియాత్ర



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పటమట(విజయవాడతూర్పు): ఆయుధాలు లేని ప్రపంచాన్ని భవిష్యత్ తరాలకు అందిదాలని స్టెల్లా కళాశాల ప్రిన్సిపాల్ జస్వింత క్వాడ్రస్ అన్నారు. నాగసాకి, హిరోషిమాపై అణు బాంబులు వేసి 78 ఏళ్లవుతున్న సందర్భంగా కళాశాల ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. అణు బాంబు దాడులకు బలైన వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయా దేశాల్లో అంతర్గత ఉద్రిక్తతలు ప్రపంచ అశాంతికి ఆజ్యం పోశాయని ఆందోళన వ్యక్తం చేశారు. అవి మానవ ఉనికిని ప్రశ్నిస్తున్నాయని పేర్కొన్నారు. నిరాయుధీకరణ అనేది సురక్షితమైనదన్నారు. విద్యార్థులు 'యుద్ధానికి నో చెప్పండి,' ప్రపంచానికి శాంతిని వ్యాప్తి చేయండి' అంటూ ర్యాలీలో నినాదాలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఓడీ డాక్టర్ జి. లిటిల్ ఫ్లవర్, సీనియర్ అధ్యాపకురాలు పి.పద్మలత, ఇతర ఫిజిక్స్ విభాగం సభ్యులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి పంచామృత అభిషేకం

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం అయ్యప్పస్వామి మందిరంలో బుధవారం మణికంఠ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన స్వామికి పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు జరిగాయి. గురుస్వామి బల్లెం పూర్ణయ్యస్వామి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులు స్వామిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.



స్వచ్ఛంద సంస్థల సేవలు సద్వినియోగం చేసుకోవాలి



మహిళలకు మిషన్లు అందజేస్తున్న మల్లికార్జునరావు, కోయ సుధ తదితరులు

మైలవరం:స్వచ్ఛంద సంస్థలు ద్వారా నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ శిబిరాల సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ పారిశ్రామికవేత్త చలవాది మల్లికార్జునరావు తెలిపారు. మైలవరం మదర్‌థెరీసా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన మహిళల కుట్టు శిక్షణ కార్యక్రమంలో శిక్షణ పొందిన మహిళలకు మల్లికార్జునరావు, రోటరీ క్లబ్ సహకారంతో మదర్ థెరీసా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్లు, మోటార్లు స్థానిక సీఎంఆర్ కల్యాణ మండపంలో బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ మదర్ థెరీసా ట్రస్టు అధ్యక్షురాలు కోయ సుధ మహిళల్లో స్ఫూర్తి నింపుతూ వారి కుటుంబాలను ఆర్థికంగా బలపర్చుకోడానికి తమవంతు సహకారం అందించడం అభినందనీయమన్నారు. మైలవరం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చలవాది మధుసూదనరావు, మోస్ట్ చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి ప్రసాద్, కోశాధికారి అమీర్ హంజా, పద్మజ ట్రస్టు కో–ఆర్డినేటర్ గోపాలం మాస్టారు, జమిలిరెడ్డి, బీవీకే ప్రసాద్, ఆర్గనైజర్ గంగ, ట్రస్ట్ కోశాధికారి డి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

రుణాలు సక్రమంగా వినియోగించుకోవాలి

కేడీసీసీ బ్యాంక్ చీఫ్ మేనేజర్ తెనాలి శ్రీనివాసరావు



తిరుపతమ్మ గ్రూపునకు రుణం విడుదల చేస్తున్న చీఫ్ మేనేజర్ శ్రీనివాసరావు, యేసోబు

గంపలగూడెం: బ్యాంక్‌ల ద్వారా రుణాలు తీసుకొంటున్న స్వయంసహాయక సంఘాల మహిళలు సక్రమంగా వినియోగించుకుని తమ ఆర్థిక పరిపుష్టితను పెంచుకోవాలని గంపలగూడెం కేడీసీసీ బ్యాంక్ చీఫ్ మేనేజర్ తెనాలి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక కేడీసీసీ బ్యాంక్‌లో బుధవారం వివిధ గ్రామాలకు చెందిన పలు గ్రూపులకు మంజూరైన రుణాలను పంపిణీ చేశారు. పెద్దకొమిరకు చెందిన తిరుపతమ్మ, దుర్గామాధవి, లక్ష్మీభవానీ, చిన్నకొమిరకు చెందిన సరస్వతి, అనూష, కనుమూరుకు చెందిన దేవి, లక్ష్మి, సత్యవాణి, గాయత్రి స్వయం సహాయక సంఘాలకు మొత్తం రూ.1.03కోట్లు విడుదల చేసినట్లు శ్రీనివాసరావు తెలిపారు. ఒక్కో గ్రూపునకు రూ.8లక్షల నుంచి రూ.15లక్షలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. సూపర్‌వైజర్ మల్లాది యేసోబు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు



తిరువూరు మండలం లక్ష్మీపురంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం

లక్ష్మీపురం(తిరువూరురూరల్): మండలంలోని లక్ష్మీపురంలో చౌటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు కల్యాణచక్రవర్తి, పూజిత ఆధ్వర్యంలో బుధవారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం జరిగింది. గ్రామంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

జూదరుల అరెస్ట్

నూజివీడు: మండలంలోని సిద్ధార్థ నగర్ అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై రూరల్ పోలీసులు బుధవారం దాడి చేశారు. ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.34,500, ఎనిమిది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు రూరల్ ఎస్సై తలారి రామకృష్ణ తెలిపారు.

19న 5వ వార్డుకు ఉప ఎన్నిక

దాట్రాయి: మండలంలోని సోమవరం గ్రామ పంచాయతీ ఐదో వార్డు ఉప ఎన్నికలు ఈ నెల 19వ తేదీన నిర్వహించనున్నట్లు ఎనిక్షకల అధికారి మంగళవారం తెలిపారు. 10వతేదీవరకు నామినేషన్లు స్వీకరిస్తామని, ఆదేరోజునే ఫలితాలు వెల్లడిస్తామన్నారు.









